

మనం

కడప | అన్నమయ్య



పరిషత్ పోరు.. బ్యాలెట్ తీర్పు నేడే!

పల్లె పీఠం ఎవరిదో? తేలనున్న 242 మంది అభ్యర్థుల భవితవ్యం

జిల్లా వ్యాప్తంగా 5 డివిజన్లలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

కూటమి సమన్వయానికి పరీక్ష.. వైకాపా ఉనికికి సవాల్

ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు.. మధ్యాహ్నానికే స్పష్టమైన సరళి

(మనం ప్రతినిధి కడప, నవంబర్ 6)

గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పీఠం దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పక్షాల మధ్య హోరాహోరీగా సాగిన పరిషత్ రణరంగం తుది ఘట్టానికి చేరుకుంది. ప్రచారంలో నాయకులు గుప్పించిన వాగ్దానాలు, విమర్శనాస్త్రాలు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వేసిన వ్యూహాలకు బ్యాలెట్ బాక్సుల రూపంలో నేడు జవాబు లభించనుంది. వైయస్సార్ కడప జిల్లాలోని 21 మండలాల్లోని 16 జడ్పీటీసీ, 55 ఎంపీటీసీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. బరిలో నిలిచిన 242 మంది అభ్యర్థుల రాజకీయ జాతకాలు నేటితో తేలనున్నాయి. జిల్లాలోని మొత్తం 4,56,650 మంది ఓటర్లకుగానూ ఉదయం 11గంటల సమయానికి 1,57,845 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 34.57 శాతం పోలింగ్ నమోదైంది. ఇప్పటికే పలు స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న అధికార కూటమి పక్షాలు.. క్షేత్రస్థాయిలో ప్రజాతీర్పు తమవైపే ఉందని నిరూపించుకోవాలని భావిస్తుండగా, జిల్లాపై తన పట్టును నిలబెట్టుకునేందుకు ప్రతిపక్ష వైకాపా సర్వశక్తులూ ఒడ్డింది.

ఐదు డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాలు.. పకడ్బంది భద్రత

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పర్యవేక్షణలో ఐదు రెవెన్యూ డివిజన్లలో ప్రత్యేక లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ నేతృత్వంలో మూడంచెల పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కౌంటింగ్ కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తున్నారు. గుర్తింపు కార్డులు ఉన్న ఏజెంట్లు, సిబ్బందిని మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు.

బద్వేలు డివిజన్: నువ్వా-నేనా అన్నట్లుగా పోరు

బద్వేలులోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో తెదేపా, వైకాపా మధ్య పోరు నువ్వా-నేనా అన్నట్లుగా సాగింది. ఓటింగ్ విషయానికొస్తే.. శ్రీ అవధూత కాశీనాయన మండలంలో అత్యధికంగా 51.49శాతం మేర 11,687ఓట్లు పోలవగా, బి.కోడూరులో 43.01 శాతంతో 6,789 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే కలసపాడు మండలంలో 35.38 శాతంతో 9,097 ఓట్లు, మైదుకూరులో 33.88 శాతంతో 9,313 ఓట్లు, గోపవరంలో 31.93 శాతంతో 4,912 ఓట్లు, బి.మఠంలో 31.56 శాతంతో 10,095 ఓట్లు పడ్డాయి. పోరుమామిళ్ల మండలంలో మాత్రం మందకొడిగా 28.48 శాతం మేర 1,761 ఓట్లు మాత్రమే నమోదయ్యాయి.

జమ్మలమడుగు డివిజన్: ఆధిపత్యం నిరూపించుకునేందుకు తీవ్ర పోటీ

జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేశారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో స్థానిక నేతల మధ్య ఆధిపత్య పోరు రసవత్తరంగా మారింది. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే.. ప్రొద్దుటూరు మండలంలో అత్యధికంగా 41.79 శాతం మేర 1,550 మంది ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. మైలవరంలో 39.83 శాతం నమోదై 13,156 ఓట్లు పోలవగా, దువ్వూరు మండలంలో 37.67 శాతంతో 1,974 మంది ఓటేశారు. పెద్దముడియం మండలంలో 35.43 శాతం పోలింగ్‌తో 8,965 ఓట్లు నమోదయ్యాయి.

పులివెందుల డివిజన్: సొంత గడ్డపై ఉత్కంఠ

రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి రేపుతున్న పులివెందుల డివిజన్ ఓట్ల లెక్కింపు స్థానిక రమణప్ప సత్రం, జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో జరగనుంది. వైకాపా అధినేత సొంత గడ్డపై కూటమి ప్రభావం ఏ మేరకు ఉంది, పాత పట్టు అలాగే కొనసాగుతోందా అన్న ఉత్కంఠ నెలకొంది. ఇక్కడి వేముల మండలంలో అత్యధికంగా 50.80శాతం పోలింగ్‌తో 11,369 ఓట్లు నమోదు కాగా, పులివెందుల మండలంలో 47.19శాతంతో 5,088ఓట్లు పోలయ్యాయి. వేంపల్లి మండలంలో 37.62శాతంతో 17,284మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లింగాల మండలంలో అతి తక్కువగా 22.80శాతంతో కేవలం 5,443ఓట్లు మాత్రమే నమోదయ్యాయి.

కడప డివిజన్: రెండు మండలాల్లో సాఫీగా పోలింగ్


నగర శివారులోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఈడివిజన్ పరిధిలోని ఒంటిమిట్ట మండలంలో 30.64 శాతం ఓటింగ్ నమోదై 7,721 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా సిద్ధవటం మండలంలో 26.44 శాతం పోలింగ్‌తో 1,702 ఓట్లు పోలయ్యాయి.

రాజంపేట డివిజన్: కూటమి సమన్వయానికి అసలైన పరీక్ష

రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని పకడ్బందీగా సిద్ధం చేశారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి ఐక్య పోరాటం క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితాన్ని చ్చిందో ఈ తీర్పుతో తేలిపోనుంది. ఇక్కడ నందలూరు మండలంలో 31.89 శాతంతో 8,276 ఓట్లు, రాజంపేట మండలంలో 27.36శాతంతో 13,356ఓట్లు పోలయ్యాయి. టి.సుండుపల్లి మండలంలో 24.43 శాతంతో 7,861 ఓట్లు నమోదు కాగా, జిల్లాలోనే అత్యల్పంగా వీరబల్లి మండలంలో 17.44 శాతంతో కేవలం 446 ఓట్లు మాత్రమే పోలవడం గమనార్హం.

భవితవ్యం తేలేది వీరికే..

గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పీఠం దక్కించుకోవాలని తహతహలాడిన అభ్యర్థుల్లో ఫలితాల వేళ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కూటమి ప్రభుత్వ పాలన తీరుపై ప్రజలు వేసిన ముద్రగా అధికార పక్షం, ప్రభుత్వ వ్యతిరేకతకు ప్రతిబింబంగా మలచుకోవాలని వైకాపా భావిస్తున్న ఈ ఎన్నికల ఫలితాలు.. జిల్లా భవిష్యత్తు రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి. మధ్యాహ్నం 12 గంటల సమయానికల్లా అత్యధిక స్థానాల్లో గెలుపోటములపై స్పష్టత వచ్చే అవకాశముంది.





అశ్రునయనాల మధ్య విద్యావేత్త చమర్తి సుబ్బరాజు అంత్యక్రియలు

రాయచోటికి వేలాదిగా తరలివచ్చిన నేతలు, అభిమానులు, ప్రజలు

జగన్మోహన్ రాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 6

రాయచోటిలోని ప్రముఖ విద్యాసంస్థ 'రాజు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' వ్యవస్థాపక అధినేత, వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమ్మర్థి జగన్మోహన్ రాజు పితృమూర్తి చమర్తి సుబ్బరాజు భౌతికకాయానికి శుక్రవారం అశ్రునయనాల మధ్య అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి. ఆయన మరణవార్త విన్న వెంటనే ఉమ్మడి వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల నలుమూలల నుంచి వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు, వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు రాయచోటికి చేరుకుని ఆయన భౌతికకాయాన్ని కడసారి దర్శించుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దశాబ్దాల క్రితమే రాయచోటి ప్రాంతంలో నాణ్యమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తూ ఎందరో పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన గొప్ప విద్యావేత్తగా సుబ్బరాజు చెరగని ముద్ర వేశారు. సమాజ సేవలోనూ, విద్యారంగ అభివృద్ధిలోనూ ఆయన అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం ప్రాంతానికే తీరని లోటని పలువురు ప్రముఖులు కొనియాడారు. తీవ్ర దుఃఖంలో మునిగిపోయిన చమ్మర్థి జగన్మోహన్ రాజును, వారి కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఓదార్చారు.

అనంతరం వేలాది మంది జనసందోహం, అభిమానుల నినాదాల నడుమ అంతిమయాత్ర సాగింది. స్థానిక తిరుపతి నాయుడు కాలనీ సమీపంలోని వారి సొంత వ్యవసాయ క్షేత్రంలో వందలాది మంది సమక్షంలో కుటుంబ సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. శోకసంద్రంలో మునిగిన జగన్మోహన్ రాజు మరియు కుటుంబ సభ్యులు తమ పితృమూర్తికి కన్నీటి వీడ్కోలు పలుకుతూ అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.








ధన త్రయోదశి సందర్భంగా శ్రీ ప్రత్యూష ప్రీ ప్రైమరీ స్కూల్‌లో ముందస్తు దీపావళి సంబరాలు

పుల్లంపేట నవంబర్ 6 (మనం న్యూస్)ఈరోజు ధన త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పుల్లంపేటలోని శ్రీ ప్రత్యూష ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చిన్నారులచే దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం చిన్నారుల ఉత్సాహభరితమైన సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకల్లోపాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రీ – ప్రైమరీ ఇన్‌చార్జ్ నూకల రాధ చిన్నారులకు దీపావళి పండుగ విశిష్టతను వివరిస్తూ, టపాకాయలను ఉపయోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాణసంచా వల్ల వెలువడే పొగ, శబ్దం పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగించే నష్టాలను వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా, పర్యావరణ హితమైన పద్ధతుల్లో పండుగను జరుపుకోవాలని సూచించారు. టపాకాయలు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరని, భద్రతా నియమాలు పాటించాలని చిన్నారులకు తెలియజేశారు.పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఆనందంతో పాటు ఆరోగ్యానికి, ప్రకృతికి ప్రాధాన్యతనిస్తూ పండుగలను జరుపుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చక్కని సందేశాన్ని అందించారు.ఈ వేడుకల్లో హైస్కూల్ ప్రిన్సిపాల్ టి.వి. రాజశేఖర్, ఉపాధ్యాయులు అవని, వెంకటేశ్వరి, మౌనిక, నవనీత తదితరులు పాల్గొని చిన్నారులను అభినందించారు.విద్యార్థుల్లో పండుగల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, భద్రత పట్ల చైతన్యం కల్పించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.


చమర్తి సుబ్బరాజుకు నివాళులర్పించిన కుప్పాల వెంకటసుబ్బయ్య



సిద్ధవటం, నవంబర్ 6 మనం న్యూస్: రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తండ్రి రాజు విద్యా సంస్థల అధినేత చమర్తి సుబ్బరాజు మృతి చెందడం చాలా బాధాకరమని ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించామన్నారు ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ మాట్లాడుతూ పేద బలహీన వర్గాలకు అండగా రాజు విద్యాసంస్థలు ఏర్పాటుచేసి నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అండగా నిలబడి ప్రతి ఒక్కరూ చదువుకునే విధంగా ఆయన చేసిన సేవలు ప్రతి హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు ఆయన పార్థివ దేహాన్ని కడసారిగా చూడడానికి వేలాదిమంది తరలి వచ్చారని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సిద్ధవటం మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠ..ఓట్ల లెక్కింపు

శనివారం ఉదయం 8 గంటల నుండి రైల్వేకోడూరు ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ ప్రారంభం



చిట్వేలీ నవంబర్ 6 మనం న్యూస్: చిట్వేలీ మండలంలో నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం నవంబర్ 7న ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. రైల్వేకోడూరు పట్టణంలోని ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చిట్వేలీ మండల రిటర్నింగ్ అధికారి జయ భరత్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనవచ్చనీ. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును ఒకేసారి నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

పెట్రోల్ బాంబుల దాడి వైసీపీ కుట్రలో భాగమే..!

టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం

డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులు రెడ్డి



పెనగలూరు (నవంబర్ 06), మనం న్యూస్:
పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న పెట్రోల్ బాంబుల దాడి ఘటన వైఎస్సార్‌సీపీ కుట్రలో భాగమేనని డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల రోజున తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు బయట నుండి రౌడీ లను తీసుకువచ్చి పెట్రోల్ బాంబులతో టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. స్థానికంగ నల్లపురెడ్డిపల్లి లో తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ పెరుగుతుండటంతో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ప్రజలను, ముఖ్యంగా వృద్ధులను, మహిళలను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఈ దాడులకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. బయటి ప్రాంతాల నుంచి రౌడీ లను తీసుకొచ్చి ఇనుప రాడ్లు, కర్రలతో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయించారని ఈ ఘటనలో పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారని తెలిపారు. పోలింగ్ ప్రారంభానికి ముందే గొడవలు సృష్టించి, పెట్రోల్ బాంబులు విసిరి ఎన్నికల ప్రశాంతతకు విఘాతం కలిగించే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనతో తెలుగుదేశం పార్టీకి, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మరోవైపు టీడీపీ వారే పెట్రోల్ బాంబులు విసిరినట్లు వైసీపీ అనుకూల మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోం దని, వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసారన్నారు.

ఎన్నికల సమయంలో జరిగిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పాల్‌రెడ్డి, లేబాక రెడ్డయ్యరెడ్డి, కొప్పోలు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువశక్తి ఆలోచన సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం





ప్రొద్దుటూరు నవంబర్ 6 మనంన్యూస్: దేశంలోని యువశక్తి ఆలోచన విధానాన్ని సమాజం అభివృద్ధి చెందేందుకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ మరియు మై భారత్ కేంద్ర కడప ఆధ్వర్యంలో సీబీఐటీ కళాశాల ప్రాంగణము నందు యూత్ పార్లమెంట్ 2027 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం కోసం యువత ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి అని సూచించారు. భారతదేశంలోని యువత మేధాశక్తిని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. గెలుపు ఓటములు ఏదైనా ముందడుగు వేయాలని జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన యువత వన్ నేషన్ వన్ ఎలక్షన్ పైన వారి యొక్క ఆలోచన విధానాన్ని వివరిస్తూ వారి ఆలోచన విధానాన్ని స్పష్టంగా తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అంశంపై చక్కగా వివరించారు. మై భారత్ కేంద్ర యూత్ ఆఫీసర్ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలలో యువత తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమం నందు ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి త్వరలోనే రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని వెల్లడించారు. మారుమూల పల్లె నుంచి ఢిల్లీ దాకా వెళ్లి పార్లమెంటులో ప్రసంగించే అరుదైన అవకాశం యువతకు దక్కుతుందని పేర్కొన్నారు.అనంతరం విజేతలకు నగదు బహుమ తులను ప్రధానం చేసి, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటి కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపాల్ శృతి, న్యాయ నిర్ణేతలుగా కే. శ్రీనివాస్ కుమార్, మల్లెల లక్ష్మీ తనూజ, సంజీవ రాయుడు, శూలం లక్ష్మీదేవి, మై భారత్ కేంద్ర సిబ్బంది వెంకటేశు, బాలరాజు, వెంకటసుబ్బయ్య, వీరయ్య, రవి, లక్ష్మీనారాయణ, మల్లిఖార్జునలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు



తిరుపతి, మనం న్యూస్: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని 8 కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.శుక్రవారం స్థానిక శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ నెల 7న మొత్తం 8 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో పరిసర ప్రాంతాలకు చెందిన నాలుగైదు మండలాల ఓట్ల లెక్కింపు జరిగేలా ప్రణాళిక రూపొందిం చామని పేర్కొన్నారు. ఒకే బ్యాలెట్ బాక్స్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలు వేయడం వల్ల తొలుత వాటిని వేరు చేసి, అనంతరం జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలను సంబంధిత సెగ్మెంట్ల వారీగా కలిపి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమాంతరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ ఏజెంట్ల కోసం ప్రత్యేక బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి పొందిన కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామని, పోటీలో ఉన్న అభ్యర్థి లేదా వారి ఏజెంట్‌లో ఒకరికి మాత్రమే ప్రధాన రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) టేబుల్ వద్దకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలతో పాటు నగరి నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట మండలాలకు సంబంధించిన మొత్తం 8 మండలాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి మధ్యాహ్న భోజన సమయానికి ఎంపీటీసీ ఫలితాలు, సాయంత్రం 6 నుంచి 7 గంటలలోపు జెడ్పీటీసీ ఫలితాలు వెల్లడించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మీడియా ప్రతినిధులకు కౌంటింగ్ కేంద్రాల వెలుపల ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక స్క్రీన్, సమాచార షీట్లను అందుబాటులో ఉంచుతామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద తగినంత మంది పోలీసు సిబ్బందిని నియమించామని, కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి కలిగిన కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి, రాకపోకలను క్రమబద్ధీకరిం చడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా ఎస్పీ కోరారు.